కూరగాయలతో ఆదాయం

- ఇంటివద్దే సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న బెంగాలీలు
- మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని వేడుకోలు


ఇంటి పెరటిలో సాగు చేస్తున్న కూరగాయలు


కోతకు సిద్ధంగా ఉన్న ఆకుగోబి

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్ గ్రామంలో నివాసం ఉన్న బెంగాలీ రైతులు కూరగాయల సాగులో లాభాలు అర్జిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రవీంద్రనగర్ 1, 2 గ్రామాలలో సుమారు 5వేల మంది నివసిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న బెంగాలీలకు భారత ప్రభుత్వం గతంలో నివాసం, ఉపాధి కోసం ఐదు ఎకరాల పంట భూమి, సుమారు 14 గుంటల ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. స్థానికంగా ఇతర ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వీరికి వ్యవసాయమే జీవనాధారంగా మారింది. వర్షాలు కురవకపోయినా ఉన్న వనరులను వినియోగించుకొని అనుకూలమైన పంటలతో ఆర్థికంగా ఆదాయం సాధిస్తున్నారు.

సంప్రదాయ పద్ధతుల్లో..

బెంగాలీలు సంప్రదాయ పద్ధతులతో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా అధిక ఆదాయాన్నిచ్చే కూరగాయలను స్థానికంగా పండిస్తున్నారు. స్థానికంగా లభించే కూరగాయలతో పాటు ప్రత్యేక రకాలను పండిస్తూ మార్కెట్‌లో తమకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. సాధారణంగా తమ వ్యవసాయ భూములలో వరి, సోయా, పత్తి, కంది పంటలను పండించడంతో పాటు మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను అనుసరించి ఇంటి పెరటిలోనూ కూరగాయలను పండిస్తున్నారు. వారసంతల్లో లభించే చిక్కుడు, బీర, ఆకుకూరలు, గోబి, టమాట, వంకాయలతో పాటు బీట్‌రూట్, పరల్, గడ్డగోబి, ముల్లంగి, క్యారట్, పనస, అరటికాయ రకాలను పండిస్తున్నారు. కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు కాకుండా సంప్రదాయ పద్ధతులలోనే పంటలు సాగు చేస్తున్నారు.

200 ఎకరాల్లో సాగు..

రవీంద్రనగర్ పరిధిలో సుమారు 2300 ఎకరాల సాగు భూమి ఉండగా సుమారు 200 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో మొదటి పంటగా సాధారణ పంటను, అదే భూమిలో పంటకోత అనంతరం కూరగాయలు సాగు చేస్తున్నట్లు బెంగాలీ రైతులు పేర్కొంటున్నారు. దీంతో పంటల సాగులో నష్టానికి గురైనా కూరగాయల సాగుతో నష్టాన్ని భర్తీ చేస్తున్నామంటున్నారు. పూర్తిగా వరి, పత్తి, సోయా, కంది పంటలపై ఆధారపడితే వర్షాభావ పరిస్థితులు, చీడపీడల కారణంగా తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుందని, కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నట్లు వారు తెలిపారు. ఒక ఎకరాలో కూరగాయల సాగుతో డిమాండ్‌ను బట్టి రూ. 20వేల నుంచి రూ.30వేల వరకు అర్జిస్తున్నారు. నీటి వనరుల కొరత కారణంగా ఇంటి ఆవరణలో ప్రత్యేక రకాలను సాగు చేస్తున్నారు. వేసవి కాలంలో కూరగాయల సాగు ద్వారా కుటుంబ అవసరాలకు సరిపడే ఆదాయాన్ని పొందుతున్నట్లు బెంగాలీలు పేర్కొంటున్నారు.

మహారాష్ట్రలో విక్రయం..

కొన్ని రకాల కూరగాయలకు స్థానికంగా డిమాండ్ లేకపోవడంతో మహారాష్ట్రలోని చంద్రపూర్, గడిచిరోలి జిల్లాలకు తరలిస్తున్నారు. మార్కెటింగ్ సౌకర్యంతో పాటు కూరగాయలు నిల్వ చేసుకునే వసతిని ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని బెంగాలీలు డిమాండ్ చేస్తున్నారు. కూరగాయల సాగుపై శాస్త్రీయ పరిశోధనలతో రైతులకు విత్తనాలు అందజేయాలంటున్నారు. రబీ సాగులో కూరగాయలకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలకు డిగ్రీ విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రాథమిక స్థాయి విద్యార్థులలో అవసరమైన నైపుణ్యాలు పెంపొందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పిల్లల కోసం కార్యక్రమంలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. డిగ్రీ కళాశాల నుంచి 100 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని శనివారం ఆయా పాఠశాలలకు వెళ్లి ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పాఠాలు బోధించినట్లు పేర్కొన్నారు.

'రుణాలు చెల్లించండి'


మహిళలతో మాట్లాడుతున్న సుభాశ్

కెరమెరి: బ్యాంకుల ద్వారా, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఐకేపీ సీసీ రాథోడ్ సుభాశ్ అన్నారు. శనివారం మండలంలో పార్ద, ధనోరా గ్రామాల్లో స్వయం సహాయక సంఘ సభ్యులతో మాట్లాడారు. సంఘంలోని మహిళలు పొదుపు చేయడం వల్ల అధిక లాభాలు గడించవచ్చన్నారు.

జైభీం సేన జిల్లా కమిటీ ఎన్నిక


ఎన్నికైన జైభీం సేన కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ జైభీం సేన జిల్లా నూతన కమిటీని శనివారం జిల్లా కేంద్రంలోని లుంబినీ దీక్షాభూమి ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాడి వినోద్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, ఉపాధ్యక్షులుగా అతీశ్, శ్రీకాంత్, ఆకాశ్, రమేశ్, ప్రమోద్, సంయుక్త కార్యదర్శులుగా ప్రశాంత్, నవీన్, గౌతమ్, విలాస్, అధికార ప్రతినిధిగా భరత్, సురేశ్, కార్యదర్శులుగా వెంకటేష్, నితిన్, దీపక్, భీంరావ్, సలహాదారులుగా సాంబయ్య, కృష్ణాజి, చైతన్య, టీమాజి, పెంటయ్య, హోక్టుజి, తుకారంలను కమిటీ ప్రతినిధులుగా ఎన్నుకున్నారు.

21న మహా పాదయాత్ర

సిర్పూర్(టి): మండలంలోని శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయ కమిటీ, ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 21న మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సంవత్సరం కార్తీకమాసంలో శ్రీ సిద్ధి టోంకిని హనుమాన్ ఆలయ భక్తులు నిర్వహించనున్న మహాపాదయాత్ర వేకువజామున కాగజ్‌నగర్ పట్టణంలోని రామమందిరం నుంచి ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాటుసారా పట్టివేత

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామంలో నాటుసారా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ మంగమ్మ తెలిపారు. ఈ దాడుల్లో 10 లీటర్ల గుడుంబాను పట్టుకొని పులబోయిన శంకర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గుండాయిపేట్ గ్రామంలోని కిరాణాషాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో మద్యం స్వాధీనం చేసుకొని శ్రీనివాస్ గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కిషన్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

జైనూర్: మండలంలోని స్థానిక సర్రాన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో శనివారం పత్తి కొనుగోళ్లను వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ హైమద్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటకు క్వింటాల్‌కు ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.7020 కల్పిస్తుందన్నారు. రైతులు పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. రైతులు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌ను తప్పకుండా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సీసీఐ అధికారి ఏవో పవన్ కుమార్, అబ్దుల్లా రమేశ్, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల విస్తృత తనిఖీలు

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని శనివారం బెల్లంపల్లిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. టూటౌన్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు వద్ద రోడ్డుకు ఇరువైపులా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలను నిశితంగా పరిశీలించిన తర్వాత పంపించారు. ఎన్నికల వేళ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50వేలకు పైబడి డబ్బులు తీసుకువెళ్లొద్దని ప్రయాణికులకు వివరించారు. సాయుధ పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

మనువాద పార్టీలను ఓడించండి

- ఆర్‌పీఐ జాతీయ అధ్యక్షుడు, అంబేద్కర్ మనువడు ప్రకాశ్ అంబేద్కర్


మాట్లాడుతున్న ప్రకాశ్ అంబేద్కర్

సిర్పూర్(టి): తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజుల్లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మనువాద పార్టీలను ఓడించాలని ఆర్‌పీఐ జాతీయ అధ్యక్షుడు ప్రకాశ్ అంబేద్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సిర్పూర్(టి) నియోజకవర్గ ఆర్‌పీఐ పార్టీ అభ్యర్థి జాడి దీపక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకరికి ఒకరు పరస్పరం సహకరించుకుంటూ అంబేద్కర్‌వాదాన్ని, భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడేది అంబేద్కర్‌వాదుల పార్టీ ఆర్‌పీఐ పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ రాష్ట్ర ఇన్‌చార్జి బోర్లకుంట దిలీప్‌కుమార్, బెల్లంపల్లి నియోజకవర్గ అభ్యర్థి రాంటెంకి శ్రీనివాస్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి చంద్రశేఖర్, మాస్కె నాగేశ్, సికిందర్, షేక్ షరీఫ్, రాంటెంకి లక్ష్మణ్, సందీప్, ప్రణీత్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉన్నతి'పై అవగాహన


మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు శనివారం ఉన్నతి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఇంటింటా చదువుల పంట కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విద్యా బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సోమయ్య, హెచ్ఎంలు హన్మంతు, నానాజీ, నారాయణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. తిరిగి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హరీశ్‌బాబును అడ్డుకున్న చిన్నగుడిపేట గ్రామస్తులు


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

భీమిని: సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు శనివారం చిన్నగుడిపేటలో ప్రచారం చేస్తుండగా పలువురు అడ్డుకొని నిరసన తెలిపారు. గత ఐదేళ్లుగా ఒక్కసారి కూడా గ్రామానికి రాలేదని, ఇప్పుడు ఓట్ల కోసం వచ్చారా అంటూ నిలదీశారు. పోలీసులు జోక్యం చేసుకొని నిరసనకారులను శాంతింపజేశారు.

జీఎంతో నూతన కమిటీ భేటీ


జీఎంతో అసోసియేషన్ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ నాయకులు శనివారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని కలిశారు. ఇటీవల డివిజన్ నూతన కమిటీ ఎన్నికైన నేపథ్యంలో అసోసియేషన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జీఎంను ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నూతన కమిటీని జీఎంకు పరిచయం చేశారు. కమిటీ సభ్యులు అసోసియేషన్ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించాలని జీఎంను కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఏరియా ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్ కుమార్, కార్యదర్శి నక్క సుమన్, నాయకులు అందే వెంకటేష్, రెడ్డపాక లక్ష్మణ్, గోదారి మురళి, శెట్టి శంకరయ్య, ప్రవీణ్, ఎర్రోళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


గుల్లకోటలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట, తలమల, కొమ్ముగూడెం గ్రామాల్లో ఎన్నికల సహాయాధికారి రాఘవేంద్రరావు శనివారం పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎన్నికల సమయం సమీపిస్తున్నందునా, ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లోని పలువురికి ఎన్నికల పోలింగ్ చిట్టీలను అందించి అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సమ్మక్క, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నేడు ఈటల రాజేందర్ రాక

నస్పూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ హుజూరాబాద్ ఎమ్మెల్యే, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఆదివారం పట్టణానికి వస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అగల్ డ్యూటీ రాజు తెలిపారు. శనివారం ఆయన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈటల రాజేందర్ పట్టణంలో నిర్వహించే ర్యాలీ, కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని తెలిపారు.

ట్రినిటీ పాఠశాలలో సైన్స్‌ఫేర్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు వారి యొక్క పరిజ్ఞానంతో తయారు చేసిన పరికరాలను పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్ పరిశీలించారు. అనంతరం పరికరాలను పరిశీలించి ఉత్తమ బహుమతులు ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



దహెగాం: దహెగాం నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై మూలమలుపు వద్ద రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. మండలంలోని ఇట్యాల గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై అత్యంత ప్రమాదకరంగా మూలమలుపు ఉంది. మూలమలుపు వద్ద విద్యుత్ స్తంభం ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్డు..!

- ఆరు నెలల క్రితం బీటీ తొలగించిన వైనం
- అర్ధంతరంగా నిలిచిన పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కంకర తేలిన ఖమాన రహదారి

వాంకిడి: మండల కేంద్రం నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే ఖమాన గ్రామ ప్రధాన రహదారి అర్ధంతరంగా నిలిచిన పనులతో అధ్వానంగా మారింది. ఖమానకు వెళ్లే రోడ్డుపై దశాబ్దాల క్రితం నిర్మించిన బీటీ అక్కడక్కడ తొలగిపోయి గుంతలు ఏర్పడటంతో మండల అధికారులు నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో గతేడాది రాష్ట్ర ప్రభుత్వం నూతన రహదారి నిర్మాణానికి రూ.1.57 కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండర్లు వేయడం గుత్తేదారు పనులు ప్రారంభించడం వెనువెంటనే జరిగిపోయాయి. కానీ వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు ప్రారంభించిన గుత్తేదారు, రోడ్డుపై ఉన్న బీటీని తొలగించి అర్ధంతరంగా పనులు నిలిపివేశారు. గత ఐదు నెలలుగా రోడ్డు నిర్మాణంలో ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం రోడ్డంతా కంకర తేలింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఖమాన గ్రామంతో పాటు, కోమటిగూడ, కనర్‌గాం, వెల్గి, లక్ష్మీపూర్, లైనగూడ గ్రామ పంచాయతీల పరిధిలోని సుమారు 30కి పైగా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే ఈ రహదారి గుండా వెళ్లాల్సిందే. కంకర తేలిన రోడ్డుతో వాహనాలు పాడైపోతున్నాయని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలు పాడైపోతున్నాయి..



ఏదో ఒక పని నిమిత్తం ప్రతీరోజు మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. రహదారి మొత్తం కంకర తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో ద్విచక్రవాహనాలు పాడైపోతున్నాయి. అధికారులు స్పందించి బీటీ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– జాడి మనోహర్, వార్డు సభ్యుడు, ఖమాన

ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు పనులు అర్ధాంతరంగా వదిలేయడంతో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. సదరు గుత్తేదారు ఉన్న బీటీని తొలగించి తన ఇష్టానికి వదిలేయడంతో 30 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తగు చర్యలు తీసుకోవాలి.

– లోబడె లహుకుమార్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు

గుత్తేదారు స్పందించడం లేదు



ఐదు నెలల క్రితం ఖమాన నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పనులు చేపట్టి అర్ధాంతరంగా వదిలేశారు. రోడ్డంతా కంకర తేలి అధ్వానంగా మారింది. గుత్తేదారును సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఎలాంటి స్పందన లేదు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– పెందూర్ పవన్, సర్పంచ్, ఖమాన

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి


పత్రాలు పరిశీలిస్తున్న సీఐ

కాసిపేట: మండలంలోని కోమటిచేను పోలింగ్‌స్టేషన్‌ను శనివారం మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి పరిశీలించారు. ఉదయం కాసిపేట 2గనిపై బందోబస్తు నిర్వహించిన అనంతరం వాకింగ్, రన్నింగ్ చేస్తూ సమీప ప్రాంతాల్లో పర్యటించారు. పోలింగ్ బూత్ పరిశీలించి వసతులు, సమస్యలపై ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డుపై వాహనదారుల పత్రాలు పరిశీలించి, హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. కోమటిచేను గ్రామంలో యువతతో మాట్లాడి పలు సూచనలు చేశారు. చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా చదువు, క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రతివ్యక్తి ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాసిపేట ఎస్సై గంగారాం, మందమర్రి ఎస్సై చంద్రకుమార్ ఉన్నారు.

'చదువుతో పాటు సత్ప్రవర్తనతో మెలగాలి'

మందమర్రిరూరల్: విద్యార్థినులు చదువుతో పాటు సత్ప్రవర్తనతో మెలగాలని మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి హితవు పలికారు. మందమర్రి పట్టణంలోని రామకృష్ణాపూర్ రోడ్డులో గల శ్రీ మంజునాథ ఫంక్షన్ హాల్లో శనివారం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వారు నిర్వహించిన ఫ్రెషర్స్ డేకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించి, జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మందమర్రి ఎస్సై చంద్రకుమార్, కళాశాల కరస్పాండెంట్ హిరాలాల్ ఉపాధ్యాయ, ప్రిన్సిపల్ సుష్మా, రాజేశం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యంతో అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: ముందస్తు సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం రేషన్ బియ్యం పట్టుకున్నారు. శనివారం మండలంలోని మోతుగూడ గ్రామంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 4.50 క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్యామ్‌లాల్ తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకొని బొమ్మన సాగర్ అనేక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.